# లా'కప్'లావణ్యం

"వినయ్ అన్నయ్యను పోలీసులు అరెస్ట్ చేసింద్రటా. అమల వదిన చెప్పింది."

కంప్యూటర్లతో కుస్తీ పట్టి అలసి సొలసి ఆఫీసు నుండి రాగానే అర్థాంగి అరకప్పు చాయ అందిస్తూ ఆటంబాబు పేల్చింది. కొద్ది సేపు బుర్ర పంజేయ్యలేదు. నిట్టూరుస్తూ సోఫా కొరిగాను.

"చాల్లేవోయ్ ! జోకులు పీకుడు. అమల నీకెక్కడ కన్పించిందనీ !" గరం చాయ శక్తి నరాల్లో పాకుతుంటే రిమోట్‌తో టీ.వి. ఆన్ చెయ్యబోయాను.

"జోకులు కాదండీ ! అదో ... ఆమెనే అడగండి" తలదించుకుని గదిలోంచి బయటికొస్తున్న అమలను చూపించింది.

కాపు రాజయ్య గీసిన రంగుల చిత్రంలాగుండే అమల వాడిపోయిన మల్లెపూవు లాగుంది.

"ఏమైందమ్మా !" అడిగాను ఆదుర్దాగా.

"నిన్న అర్ధరాత్రి పేకాట క్లబ్బులో గద్బడైందటా ...!" నేరస్తురాలిలా నేల చూపులు చూస్తోంది.

ఉద్యోగ పర్వంలో ప్రమోషన్ మెట్టెక్కి రెండేళ్ల క్రితం ఈ పట్టణానికొచ్చాను. బాల్య స్నేహితుడు వినయ్ అప్పటికే ఇక్కడ కాంట్రాక్టర్‌గా స్థిర పడ్డాడు. వానితో హాయిగా కాలక్షేపం చెయ్యొచ్చనుకున్నాను. జాయినవగానే వాళ్లింటికెళ్లాను. ఇల్లు రాజభవనం లాగుంది. క్షేమ సమాచారాలయాక

"ఆయన మోడ్రన్ క్లబ్బుకెళ్లాడన్నా !" అంది అమల.

"మరి ... మీ బాబేడీ ?"

"ట్యూషన్ కెళ్లిండు."

"ఎల్.కె.జీ.లోనే ట్యూషనా ?"

"వానికి హోం వర్కు ఉంటుంది గదన్నా. ఆ రిస్కు నాకెందుకనీ. ...!" అంది ఎటో వెళ్లేందుకు తయారవుతూ. "అదిరిస్కా ?" అవాక్కయ్యాను. ట్రాన్‌ఫర్ సంగతి చెప్పి "అద్దె ఇల్లు వెతకాలి ఓసారి వినయ్‌ను కలువుమనమ్మా" అన్నాను. సరేనంది.

వాడసలే కనబడలేదు. కో వర్కర్సు కో ఆపరేషన్తో కొంప వెతుక్కున్నాను. మరోసారి వాళ్లింటి కెళ్లాను. అమల టీ.వి. సీరియల్లో మునిగి ఉంది. వినయ్ గురించి అడిగాను. "ఆయన క్లబ్బులో బిజీ... " అంది అటే చూస్తూ

"ఏం బిజీ ? పేకాటనా ?" నిర్మోహమాటం అడిగేసింది.

"ఆఁ... మరేమనుకున్నావన్నా ?" కాలుమీద కాలేసుకుంది.

"అదంత మంచి అలవాటు కాదమ్మా !"

"అట్లనుకుంటే ఎట్టా ? ఏదో సరదా గదన్నా"

ఆహాఁ ! భర్తను బాగానే సమర్థిస్తుందే !

ఓ రోజు పత్నీసమేతంగా సినిమా కెళ్లొస్తున్నాను. వీర సావర్కర్ చౌరస్తాలో ఇద్దరు తగవులాడుకొంటున్నారు.

"అదో... వినయన్నయ్యండీ !" అంది శ్రీమతి. వెంటనే స్కూటరాపాను. ఎవడో వినయ్ గల్లా పట్టి లెంపలు వాయిస్తున్నాడు. వెళ్లి ఇద్దర్నీ విడదీశాను. కారణమడిగాను కొత్తమనిషిని.

"క్లబ్బులో ఐదొందలు అప్పు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వడం లేద్సార్ !" వగరుస్తూ చెప్పిండు. నిజమేనా అని వినయ్‌నడిగాను. తలనేలకు వెళ్లాడేశాడు. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. "నేనిస్తా, పొద్దున మా ఆఫీసుకొచ్చి తీసుకెళ్లు" మన్నాను. అతడు వెళ్లిపోయింతర్వాత వినయ్‌తో "అరేయ్ ! జూదము, తాగుడు అన్నాదమ్ములురా! ముందు పేకాట మానెయ్" మందలించాను.

"నిన్ను కలుద్దామంటే టైమే దొరకడం లేదురా." అన్నాడు సిగ్గు అభినయిస్తూ.

"ఎట్లా దొరుకుతుందిరా, కాంట్రాక్టులో సంపాదించిదంతా క్లబ్బులో ఖర్చు కావాలి గదా ! కాలమంతా క్లబ్బుకే అంకితమాయె" మందలించి పంపించాను.

మర్నాడు ఆఫీసు నుండి ఇంటికెల్తూ వినయ్ ఇంటికెళ్లాను. వినయ్ లేడు. అమలతో అంతా చెప్పాను. దాన్నీ మామూలు విషయంగా భావించిందేమో "ఏదో సరదాకో పెగ్గు వేసుకునుంటాడంతే" అంది – అమాయకంగా.

"వాణ్ని నువ్వలా సమర్థించడం బాగాలేదమ్మా, వాడు పని మీంచి రాగానే ఇంట్లోనే ఉంచెయ్. లేక పోతే సిన్మాకో, షికారుకో తీసుకెళ్లు. ఓ రెన్నెళ్లు వాన్నట్లా కంట్రోల్ చేస్తే తాగుడు, జూదం వ్యసనాలు మానుకుంటాడు" సలహా ఇచ్చాను.

కింనాస్తి ఐపోయిందపుడు. ఇప్పుడేమో తానే స్వయంగా వచ్చి బాధపడుతుంది. "బాబును పక్కింట్లో ఉంచి వచ్చినానన్నా ! దయచేసి ఎట్టనన్నా ఆయన్ను విడిపించన్నా." కంటి తడితో బతిమాలింది. "మళ్లీసారి ఆయన్ను ఆ మాడ్రన్ క్లబ్బుకెళ్లనివ్వను. ఒట్టు." గట్టి హామీ ఇచ్చింది.

పోలీస్ స్టేషన్ కెళ్లాను. ఎస్సై లేడు. కటకటాల వెనుక వినయ్ దివాలా దీసి దెబ్బలుదిన్న కోటీశ్వరుడిలా గున్నాడు. నన్ను చూడగానే తలబాదుకుంటూ బోర్‌మన్నాడు.

సంగతేమిటని అడిగాను. వణికి పోతూ "మోడ్రన్ క్లబ్బులో పేకాటకు, తాగుడుకు బానిసనై పోయిన. సంపాదన శూన్యమైందిరా !" నెత్తి కొట్టుకుంటున్నాడు.

"నన్ను మర్డర్ కేసులో ఇరికించిర్రు. నా దగ్గరసలు కత్తేలేదు. నేను వాణ్ని పొడవనేలేదు. నా వెనుక నుండి ఇంకెవడో పొడిచిండురా !" వివరాలు అందించాడు. మాటల్లో నిజాయితీ గోచరించింది.

"వ్యసనాలకు బానిసవై కేసులిరుక్కున్నావన్న మాట. నీ గొయ్యి నువ్వే తవ్వు కున్నావు గదరా !" కోపాన్నాపుకోలేక పోయాను.

"తప్పైపోయిందిరా !" లెంపలేసుకున్నాడు. "ఇహ జీవితంలో వ్యసనాల తెరువు బోను. మా బాబు మీద ఒట్టురా !" చేతులు నెత్తిమీదుంచుకున్నాడు.

స్నేహం నీడనిచ్చే చెట్టులాంటిదాయె. అవసరంలో ఆదుకున్నవాడే అసలైన స్నేహితుడు గదా... ! ఆలోచిస్తున్నాను. వెనుకనుంచో పోలీస్ చెయ్యి నా 'భుజమ్మీద పడింది. గిరుక్కున వెనక్కు తిరిగాను. ఆశ్చర్యం... ఆనందం...

"ఒరేయ్ ! నున్న గుర్తుబట్టినవా ?" యస్సై షేక్‌హాండిచ్చాడు. వాడు ఆనంద్. మా ఇద్దరికీ క్లాసుమేటు.

"ఒరేయ్ ఆనంద్ .!... నువ్వేనా !"

"ఆనంద్‌ను నేను గుర్తు బట్టలేదురా !" వినయ్ నోరెల్ల బెట్టాడు.

"పుల్లుగా తాగితివి. ఎట్లా గుర్తుబడ్తావురా ?" ఆనంద్ లాఠీ చూపించాడు. కాస్సేపు సంఘటన గురించి మాట్లాడుకున్నాము.

"కత్తితో పొడిచింది వీడుకాదట్రా !" అన్నాను.

"ఆ సంగతి నాకు తెల్సు. కాని వీడు బాగుపడాలంటే ఈ ట్రీట్‌మెంటు తప్ప లేదురా !" విచారం వెలిబుచ్చాడు. కానిస్టేబుల్‌ను పిలిపించి వినయ్‌ను లాకప్ నుంచి బయటకు లాక్కొచ్చాడు.

***(జలధి - 16-12-2007)***